క్లుప్తంగా

బాదంపూడిలో రంగవల్లుల పోటీ



బాదంపూడిలో రంగవల్లుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

ఉంగుటూరు: బాదంపూడి గ్రామ మహిళలకు రామాలయం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి పాండ్రాకి భూలక్ష్మి, ద్వితీయ బహుమతి కడగళ్ల భవానీ, తృతీయ గాజుల దేవికి రేగాని రామకృష్ణ, కోరాడ ప్రతాప్, బూర్ల నాగు, దుర్గాశి పండు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉప్పాకపాడులో మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు.

అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు అభినందనీయం

దెందులూరు: విజయవాడలో ఈ నెల 19న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గంట ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం ఏలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ ఆధ్వర్యంలో ఘంటా ప్రసాద్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీ పేద వర్గాలందరి జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు, వారి హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం చేసిన యోధుడు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరున ప్రభుత్వం స్మృతి వనం ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరి హృదయాలను దోచుకున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను భావితరాలన్నీ గుర్తుంచుకునేలా 125 అడుగుల భారీ విగ్రహాన్ని కోట్ల రూపాయలు వెచ్చించి విజయవాడలో ప్రతిష్ఠించి, స్మృతి వనం ఏర్పాటు చేసి ఈ నెల 19న ప్రారంభోత్సవం చేయడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ కాటిసుధాకర్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీ నెట్ల లీల నవకాంతం, గంగరాజు, పెదపాడు ఎంపీపీ భత్తుల రత్నకుమారి ఏసు రాజు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల ఆధునికీకరణపై హర్షం



ఆధునికీకరించిన వాపనపాలెం - రామసింగవరం రహదారి

దెందులూరు: నియోజవర్గంలో ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టినందుంచుకొని నిధులు మంజూరు చేయించి రోడ్లను ఆధునికీకరించడం అభినందనీయమని పలువురు అన్నారు. రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చర్యలు తీసుకోవడంపై దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.7 కోట్లతో దెందులూరు నుంచి రామసింగవరం పెదపాడు నుంచి గోగుంట వరకు 14 కిలోమీటర్లు సిమెంటు, తారు రోడ్లు నిర్మించారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన హరికథ, సంగీత, నృత్య ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు కపిలేశ్వరపురానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణి శ్రీనివాస కల్యాణం అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థలకు చెందిన భక్తులు సత్యసాయి నామ సంకీర్తన నిర్వహించారు. రాత్రి 8.15 గంటలకు నగరానికి చెందిన నాట్యాచారిణి ఏ. పార్వతి రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి వేడుకలు



సత్యవోలులో బహుమతులు అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు



గుండుగొలనులో సంక్రాంతి వేడుకలో నృత్యాలు చేస్తున్న యువతులు, మహిళలు

- పోటీల్లో విజేతలకు బహుమతులు
- వాడవాడలా వేడుకలు

పెదపాడు: సంక్రాంతి పండుగను గ్రామంలో అందరూ కలిసి చేసుకుంటే కలిగే సంతోషం వెలకట్టలేమని ఉమ్మడి జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని కొంతమందిని న్యాయ నిర్ణేతలుగా ఏర్పాటు చేసి ముగ్గుల పోటీలు, వంటల పోటీలు మహిళలు, పిల్లలు విభాగాల్లో నిర్వహించిన ప్రతిభచూపిన వారికి ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిగా డిన్నర్ సెట్ , రెండో బహుమతిగా తవాసెట్, మూడో బహుమతిగా కుక్కరు అందించారు. అనంతరం పాల్గొన్న వారందరికీ లక్కీ డిప్ ద్వారా మిక్సీ బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ.కోటి నిధులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయుడు టంగుడు ఆంజనేయులు, గ్రామ యువత పాల్గొన్నారు.

రాములవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్ పర్సన్

సత్యవోలులోని రాములవారిని దర్శించుకుని ప్రత్యే క పూజలు చేసారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సీజీఎఫ్ గ్రాంటు మంజూరైందని, రూ.13 లక్షలు చెల్లించాల్సి ఉండగా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు రూ.5 లక్షలు, బంకురు నారాయణరావు రూ. లక్ష విరాళంగా ప్రకటించినట్లు తెలిపారు.

మామిళ్లపల్లి వారి ఇంట.. సంక్రాంతి సందడి

భీమడోలు: గుండుగొలనులోని మామిళ్లపల్లి వారి ఇంట మూడు రోజుల సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని మామిళ్లపల్లి వంశానికి చెందిన వారంతా కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు. ఏటా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాలు, వివిధ వృత్తుల్లో వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండుగ వేళ కుటుంబ సమేతంగా స్వగ్రామానికి చేరుకుని పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. గుండుగొలనులోని మాజీ ఉప సర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం, ఏలూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులు సుమారు 125మంది తమ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుని అక్కడ సందడి చేసారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి, చిన్నారులకు భోగి పండ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసారు. యువతులతో కలిసి మహిళలు నృత్యాలు చేసి అలరించారు. వంశానికి చెందిన అమరావతిలోని ఇరిగేషన్ శాఖ అదనపు కార్యదర్శి మామిళ్లపల్లి కాశీకుమార్, ఏలూరులోని వైఎస్సార్ సీపీ నేత జయప్రకాష్, పిల్లల వైద్యురాలు లీలాకుమార్, డాక్టర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. కనుమ రోజైన మంగళవారం వారంతా గ్రూపు ఫొటోలు దిగారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల వాల్ పోస్టర్ల విడుదల



అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కొఠారు రామచంద్రరావు

పెదవేగి : అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయసహకారాలను అందిస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా, సంతాన లక్ష్మిగా, అమ్మలను కన్న పెద్దమ్మగా పేరుపొందిన గాలాయగూడెం గ్రామదేవత అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఉత్సవాల ప్రారంభోత్సవానికి రావాలని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవకమిటీ సభ్యులు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని మంగళవారం కొండలరావుపాలెం పార్టీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. అనంతరం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, పెద్ది శెట్టి నాని, గంట సుబ్బారావు, పెద్ది శెట్టి బసవయ్య. సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షుడు తోట అచ్చయ్యతో పాటు పలువురు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కోటారు అబ్బయ్యచౌదరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను పూర్తిస్థాయి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం



డాక్టరేట్ పొందిన రంగారావును సన్మానిస్తున్న బాల్యమిత్రులు

గణపవరం: స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అంటూ చెలిమికి చిరునామాగా నిలుస్తూ.. నలభై ఏళ్లగా వారంతా క్రమం తప్పకుండా ఏడాదికి ఒకరోజు, ఒకే చోట కలుసుకుంటూ వారిమధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, కష్ట సుఖాల్లో ఒకరికొకరు పాలు పంచుకుంటూ అ'పూర్వ' విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం 1978–79లో వారంతా ఆకివీడు మండలం చినకాపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. అనంతరం వారంతా లక్ష్య సాధనకు వేర్వేరు దారుల్లో ప్రయాణించి ఉద్యోగం, వ్యాపారం వంటి వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఇప్పుడు బాధ్యతలు తీరి విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిలో ఉద్యోగాలు చేసిన వారు పదవీ విరమణ చేయగా, మరికొందరు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. వ్యాపార రంగంలో స్థిరపడిన వారు తమ వ్యాపారాలను వారసులకు అప్పగించి మనుమలు, మనవరాళ్లతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులు ఒక ప్రత్యేకత కలిగి ఉన్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు 1985వ సంవత్సరం నుంచి నేటి వరకూ ఏటా ఏదో ఒకచోట కలుసుకుని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తమ స్నేహాన్ని బలోపేతం చేసుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది వారంతా నిడమర్రు మండలం మందలపర్రులో సంక్రాంతి రోజున ఒక స్నేహితుని ఇంటి వద్ద కలిసారు. వారంతా తమ పాఠశాలలో చదువుకున్న రోజుల నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమ బ్యాచ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తూ డాక్టరేట్ పొందిన కమ్మిల రంగారావును దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్రెడ్డి రామకృష్ణ, రంగారావు, పెరుమాళ్లు, దెందుకూరి వెంకట్రాజు, మేడవరపు నాగేశ్వరరావు, మల్లారెడ్డి రవి, వానపల్లి వెంకటేశ్వరరావు, అడ్డాల బాబ్జిరాజు, బుజ్జిరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి



అంబేడ్కర్ న్యాయ మహా శిల్పం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచ్ పాము సునీత

భీమడోలు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని దీనిలో భాగంగా అనేక సంక్షేమ పథకాలతో బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలిచాయని భీమడోలు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలులో మంగళవారం మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత రూపొందించిన సామాజిక న్యాయ మహాశిల్పం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడలో 210 అడుగుల ఎత్తున రూ.400 కోట్లతో 19 ఏకరాల విస్తీర్ణంలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19వ తేదీ శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఈనెల 19న విజయవాడకు దళితులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరుతూ విస్తృత స్థాయిలో ప్రచారం చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత మాట్లాడుతూ అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకమని, సామాజిక న్యాయానికి నిలువెత్తు సాక్ష్యమని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయమే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ సుపరిపాలన సాగిస్తున్నారని అన్నారు. నవయుగ అంబేడ్కర్‌లా సీఎం జగనన్న ప్రతి ఒక్కరి గుండెల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. ఈనెల 19న శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్ సింగ్, పోలసానిపల్లి మాజీ ఉప సర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, దళిత నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పోలసానిపల్లి యూపీ పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

భీమడోలు: పోలసానిపల్లిలోని శ్రీసురభి గోవింద రాయ స్మారక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 1991 నుంచి 98 వరకు ఒకటి నుంచి ఏడో తరగతి చదువుకుంటున్న పూర్వ విద్యార్థులంతా పాఠశాల వద్దకు చేరుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి ఆత్మీయ కలయిక గుర్తుగా కేక్ కట్ చేసారు. వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలను ప్రభుత్వం నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయడంపై వారంతా ఆనందాన్ని వ్యక్తం చేసారు. విద్యార్థులు యుగంధర్, రజనీకాంత్, శివాజీ, సింహాచలం, ఇందిర, గిరిజ సరస్వతి, ఝాన్సీ, వెంకటేశ్వరరావు, కిరణ్, రాజా, సతీష్, బాబీ, పెద్దిరాజు, రమేష్, జయవర్ధన్, తాండవ కృష్ణ మురళీ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అప్పనవీడులోని అభయాంజనేయస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచామృతాలను విశాఖ పట్టణానికి చెందిన విష్ణువర్ధన్ వరహాలక్ష్మి దంపతులు అందించారు. మంగళవారం స్వామి సన్నిధిలో దాతల సాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరద సునీత, నెర్సు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వామివార్లకు ఘనంగా గ్రామోత్సవం



భీమడోలులో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న వేంకటేశ్వర, శివ స్వామి వార్లు



శ్రీరామవరంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి, శివాలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. సోమవారం భీమడోలులోని వేంకటేశ్వర స్వామి, పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒకే ట్రాక్టర్‌పై విశేషంగా అలంకరించిన వేంకటేశ్వర, శివ స్వామి వార్లను ఉంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు దర్శించుకుని పూజ లు చేశారు. గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు

దెందులూరు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీరామవరం గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. సీతారాముడు ఆంజనేయ స్వామి విగ్రహాలను ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు ఆళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, శ్రీనివాసరావు సత్యనారాయణ పూజలు నిర్వహించారు.

సంప్రదాయ క్రీడలతో ఉత్సాహంగా సంబరాలు



పెదవేగి : కత్తులు లేకుండా సంప్రదాయ పద్ధతిలో తలపడుతున్న పందెం కోళ్లు



పెదవేగి : బరుల వద్దకు భారీగా తరలివచ్చిన మహిళలు, యువత

పెదవేగి : నియోజకవర్గవ్యాప్తంగా సంక్రాంతి పురస్కరించుకుని పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఆదివారం మొదలైన కోడిపందేలు వరుసగా మూడురోజు లు కొనసాగాయి. పెదవేగి మండలంలో ప్రకాష్ నగర్, కవ్వగుంట, దిబ్బగూడెం, పెదవేగి , కూచింపూడి, కొండలరావుపాలెం విజయరాయి, భోగాపురం, తాళ్ళగోకవరం తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఈ ఏడాది పురుషులతోపాటు మహిళలు కోడి పందేలను చూసేందుకు మక్కువ చూపారు. కొండలరావుపాలెంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన కోడిపందేల్లో విజయం సాధించిన వారికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను బహూకరించారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: కోడి పందేలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, చేబ్రోలు, నారాయణపురం, రాచూరు, బాదంపూడి, వెల్లమిల్లిలో కోడిపందేలు నిర్వహించారు. ఈసారి నారాయణపురంలో గణపవరం రహదారి వెంబడి పరిశ్రమల ఆవరణలో ఏర్పాటు చేసిన బరిని ఆకర్షణీయంగా పూలతో అలంకరించారు. ఆ బరిలో మహిళలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి కోడిపందేలను వీక్షించారు. ఈ బరిలో నిర్వహించిన కోడి పందేలను ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వీక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్ తదితరులు కోడిపందేలను వీక్షించారు. బాదంపూడిలో నిర్వహించిన మరో భారీ బరిలో రాయలసీమ, తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి కోడిపందేల ప్రియులు తరలివచ్చారు. నారాయణపురం బరిలో ఏర్పాటు చేసిన డ్రా తీసి రెండు మోటారుసైకిళ్లను విజేతలకు ఎమ్మెల్యే రంగనాథరాజు అందజేశారు. బాదంపూడి బరిలో ఏర్పాటు చేసిన బుల్లెట్‌ను ఐదు పందేలు వరుసగా గెలిచిన వారికి అందజేశారు.



భీమడోలు: గుండుగొలను బరిలో తలపడుతున్న కోడి పుంజులు

ముగిసిన కోడి పందేల జాతర

భీమడోలు: కోడి పందేల బరులపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడుల చేసి మూయించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం , అంబర్‌పేట, ఆగడాలలంక గ్రామాల్లో 17 నుంచి 20 పందాల శిబిరాలను ఏర్పాటు చేశారు. గుండుగొలనులో టీడీపీ నేతల ఆధ్వర్యంలో కోడి పందేలు నిర్వహించారు.

గణపవరం మండలంలో..

గణపవరం : మండలం పరిధిలో ఎ.గోపవరం, కొమ్మర, మొయ్యేరు, చిలకంపాడు, కాశిపాడు, కోమర్రు, కొందేపాడు, జల్లికాకినాడలో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద పలావు సెంటర్లు, మాంసం పకోడి దుకాణాల ఏర్పాటు చేశారు.

బరుల వద్ద రద్దీ

నిడమర్రులో: నిడమర్రు మండలంలో బువ్వనపల్లి, పెదనింద్రకొలను, బావాయిపాలెం, ఛానమిల్లి, నిడమర్రులో పందాల బరులు ఏర్పాటు చేశారు. బువ్వనపల్లిలో ఒక బరి వద్ద ఆరు జోడీలకు నిర్వహించిన పందాలలో నాలుగు పందేలు గెలిచిన వ్యక్తికి బుల్లెట్ మోటార్‌సైకిల్ బహుమతిగా అందజేశారు. పందాలు తిలకించడానికి పలువురు ప్రజాప్రతినిధులతోపాటు, మహిళలు, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



భీమడోలు: గుండుగొలనులో పందెం కోళ్లతో యువత



ఉంగుటూరు: బాదంపూడిలో భారీ బరిలో కోడి పందేలు

ఆకట్టుకున్న గాలి పటాల పోటీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జ్యూట్ మిల్లు వద్ద ధర్మభేరి ప్రాంగణంలో వ్యాపారవేత్త నారా శేషు ఆధ్వర్యంలో నిర్వహిన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన గాలి పటాల పోటీ అందరినీ ఆకట్టుకుంది. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఫాదర్ బాల. నారా శేషు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.